చంద్రబాబుకు భారీ స్వాగత ఏర్పాట్లు

అక్రమ కేసుల్లో 53 రోజుల పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో నిర్బంధానికి గురై విడుదలై వెళ్లిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వస్తున్న నారా చంద్రబాబు నాయుడుకు ఘన స్వాగతం పలకడానికి నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నెల్లూరు జిల్లా నుంచి ప్రత్యేక విమానంలో మధురపూడి విమానాశ్రయానికి చంద్రబాబు చేరుకుంటారు. అక్కడ ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. అక్కడ నుంచి కారులో నేరుగా సభావేదిక వద్దకు చేరుకుంటారు.

నేడే.. రా కదలిరా!

- కాతేరులో బహిరంగ సభ
- ఉదయం 11 గంటలకు ఆరంభం
- 2 లక్షల మంది వస్తారని అంచనా
- 23 ఎకరాల్లో భారీ ఏర్పాట్లు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): ఇక కొద్ది రోజుల్లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల శంఖారావం పూరించడానికి తూర్పుగోదావరి సిద్ధమైంది. వచ్చే ఎన్నికలకు కేడర్, ప్రజలను సిద్ధం చేయడానికి, ప్రజా వ్యతిరేక విధానాలతో రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసిన అధికార వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సోమవారం తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలోనూ జిల్లాస్థాయి బహిరంగ సభలు ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలోని కాతేరులో సోమవారం భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు. భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. లక్షలాది మందికి స్వాగతం పలకడానికి కాతేరు గ్రామం ముస్తాబైంది. తూర్పుగోదావరి జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సభ జరగ నుంది.గోదావరి ఫోర్త్ బ్రిడ్జి సమీపంలోని కాతేరులోని తిరుమల విద్యాసంస్థల సమీపంలోని 23 ఎకరాల విశాలమైన మల్లు లేఅవుట్‌లో బహిరంగ సభకు భారీ ఏర్పాట్లు చేశారు. పెద్ద వేదికతో పాటు సభకు హాజరయ్యేవారికి ఇబ్బందిలేకుండా బారికేడ్లతో గ్యాలరీలు ఏర్పాటు చేశారు. వేదిక మీద సుమారు 100 మంది కూర్చునేటట్టు సిద్ధం చేశారు. వేదిక ముందు 10 వేల మంది వీఐపీలు కూర్చునేలా కుర్చీలు వేసి ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు.మరో పక్క మీడియాకు ఏర్పాట్లు చేశారు. 2లక్షల మంది పట్టే విధంగా విశాలమైన గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. ప్రాంగణం ఫ్లెక్సీలు, పసుపు జెండాలతో ధగధగ వెలిగిపోతోంది. సమీపంలోని తిరుమల కాలేజీ ప్రక్కన హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజవర్గాల నుంచి సుమారు 2 లక్షల మంది హాజరవుతారని సమాచారం. ఒక్కో నియోజకవర్గం నుంచి 30 వేల మంది వచ్చేటట్టు ఆయా నేతలు బాధ్యతలు తీసుకున్నారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ఆయా నియోజకవర్గాలకు వేర్వేరుగా ఏర్పాట్లు చేస్తున్నారు. సభ ఉదయం 10గంటలకే ప్రారంభమవుతుంది. చంద్రబాబు సుమారు 11.25 గంటలకు సభకు చేరుకుని, ఒంటి గంటకు తన ఉపన్యాసం ముగిస్తారు. సభ ఏర్పాట్లను మూడు రోజుల నుంచి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, శాసనమండలి విపక్ష నేత యనమల రామకృష్ణుడు, మాజీ డిప్యూటీ సీఎం నిమ్మకాయల చినరాజప్ప, మాజీమంత్రులు కేఎస్ జవహర్, ప్రత్తిపాటి పుల్లారావు, గుడా మాజీ చైర్మన్ గన్నికృష్ణ, జోన్-2 పరిశీలకుడు యనమదల రవి తదితరులు పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం కూడా వారు ఇక్కడే ఉండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. సభకు టీడీపీ, జనసేన క్యాడర్ తరలిరానుంది. సభకు 29వ తేదీన నెల్లూరు జిల్లాలో పర్యటన ముగించుకుని ఉదయం 11.15 గంటలకు ప్రత్యేక విమానంలో రాజమహేంద్రవరం విమానాశ్రయానికి వస్తారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన 11.25 గంటలకు బయలుదేరి కాతేరులోని మల్లు లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభకు వస్తారు. 11.45నుంచి ఒంటి గంట వరకూ బహిరంగ సభలో పాల్గొంటారు. అనంతరం 1.50 గంటలకు బయలుదేరి కాతేరులో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం 2గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి గుంటూరు జిల్లా చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామం వెళతారు.



తెలుగుదేశం పిలుస్తోంది రా కదలిరా సభకు సిద్ధమవుతున్న ప్రాంగణం



ఫ్లెక్సీల ఏర్పాటు



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రులు యనమల, చినరాజప్ప, గోరంట్ల,జవహర్ తదితరులు

పెళ్లి నమోదుకూ.. బాదుడే!



- గుట్టుచప్పుడు కాకుండా వివాహ రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచేసిన ప్రభుత్వం
- మూడు నుంచి నాలుగు రెట్లు ఒకేసారి పెంపు
- 1955 హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టం సవరణ పేరుతో వడ్డింపులు

పెద్దాపురం, జనవరి 28: వైసీపీ ప్రభుత్వంలో నిత్యావసరాలు, బిల్లులు, పన్నులు.. ఇలా అన్నింటా బాదుడే బాదుడు తప్పడంలేదు. ఈ కోవలోనే వివాహరిజిస్ట్రేషన్ ఫీజులను కూడా భారీగా పెంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం రూపంలో డబ్బులు ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటున్నా భారీస్థాయిలో జనం నుంచే డబ్బులు పిండేస్తోంది.

గతేడాది డిసెంబరులో జీవో

హిందూ వివాహ చట్టం-1955, 66 చట్టానికి స్వల్ప సవరణలు చేసినా రిజిస్ట్రేషన్ ఫీజులు మాత్రం గత ప్రభుత్వాలు పెంచనేలేదు. కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక వరుస వడ్డనలు జరుగుతున్న సంగతి తెలిసిందే. అన్ని శాఖల తరహాలో వివాహ రిజిస్ట్రేషన్‌ల విభాగంపైనా ప్రభుత్వం కన్నుపడింది. గతంలో ఉన్న ఫీజులను మాత్రమే మార్పులు చేస్తూ కొత్త జీవోను గతేడాది డిసెంబరులో విడుదల చేసింది. హిందూ వివాహాలు సాధారణంగా దేవాలయాల్లో, మండపాలలో లేక ఇళ్ల దగ్గర బంధువుల సమక్షంలో జరుపుకోవడం ఆనవాయితీ. మరికొందరు ఎటువంటి ఆడంబరాలు ఏమీ లేకుండా రిజిస్ట్రార్ సమక్షంలో సంబంధిత కార్యాలయంలోనే వివాహాలు చేసుకోవడం కూడా ఎప్పటినుంచో ఉంది. బయట వివాహాలు చేసుకుని తమ వివాహాన్ని చట్టబద్ధం చేసుకునేందుకు రిజిస్ట్రేషన్ చేసుకో వడం కూడా పరిపాటే. దీనికోసం గతంలో రిజిస్ట్రేషన్ దరఖాస్తుతోపాటు రూ.200 చలానా తీయడం, దంపతులు అందించే ధృవీకరణ పత్రాల పరిశీలన, రికార్డుల పరిశీలన వంటివాటికోసం రూ.50వరకూ చెల్లించడం జరిగేది. ఒకవేళ వివాహం చేసుకుంటున్న కళ్యాణ మండపం, లేక దేవాలయానికే రిజిస్ట్రార్ నేరుగా వచ్చి రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ.1100 రిజిస్ట్రార్‌ఫీజు చెల్లించాల్సి ఉండేది. కానీ వీటన్నింటినీ ఇప్పుడు మూడు నుంచి పది రెట్ల వరకూ పెంచేసింది ప్రభుత్వం.

అనధికార వసూళ్లు సరేసరి

పాత ఫీజులున్నప్పుడే మధ్యవర్తులు వివాహ రిజిస్ట్రేషన్ చేయించినందుకు తమకు, సిబ్బంది లంచాల పేరు చెప్పి రూ.4వేలు వసూలు చేసేవారు. కానీ ఇప్పుడు ఫీజులే భారీగా పెంచేయడంతో ప్రస్తుతం రూ.5వేల వరకూ అనధికార వసూళ్లు చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వం ఈ ఫీజులన్నీ పెంచడంతో దళారీఫీజులు పెంచేయాలనే ఆలోచనలో కొందరు మధ్యవర్తులు ఉన్నారని, జీవో వచ్చి నెలరోజులు మాత్రమే కావడంతో ఎంత పెంచాలనే విషయంలో ఆలోచన చేస్తున్నారని సమాచారం. అంటే ప్రభుత్వం పెంచిన ఫీజులే భారీగా ఉంటే, అనధికారికంగా వసూళ్లు కూడా పెంచేస్తే కొత్త జంటలకు వివాహ భద్రత ఇక భార మయ్యే పరిస్థితి ఏర్పడనుంది.

డిజిటలైజేషన్ పేరుతో బాదుడు

హిందూ వివాహ రిజిస్ట్రేషన్ చట్టాన్ని మార్పులు చేస్తున్నట్లు 609 జీవోలో పేర్కొన్న ప్రభుత్వం డిజిలైజేషన్‌కు సంబంధించి మార్పులు మాత్రం పెద్దగా ఏమీచేయలేదు. ఇప్పుడు డిజిటల్ ధ్రువీకరణ పత్రాలు వచ్చినా ఇంకా నకళ్లు, అడుగుతుండడం విశేషం. ఫారం-ఏను గతంలోనూ అందించాల్సి ఉండేది. ఇప్పుడు స్లాట్ బుక్ చేసుకున్నాక ఫారం-ఏను ఆన్‌లైన్‌లో నింపడం ఒక్కటే కాకుండా డౌన్‌లోడ్ చేసి మళ్లీ వాటికి ఇతర ధృవపత్రాలను జతచేసి ఇవ్వాల్సిన పరిస్థితి. మరో విశేషమేంటంటే హిందూ వివాహచట్టం రూల్స్ మార్చేందుకు ఒకకమిటీని వేశామని, వారి ముందు జనం వివరించిన అభిప్రాయాలు సూచనలు పరిగణనలోకి తీసుకుని చట్టసవరణ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఫీజు సూచనలు చేయడం వాస్తవ విరుద్ధమేనని తెలుస్తోంది.

ఫీజులు పెంచేశారిలా..

చలానా ఫీజు రూ.200కు బదులు ఏకంగా ఒకేసారి రూ.500 పెంచేశారు. దంపతులు అందించే సర్టిఫికెట్‌లు వెరిఫికేషన్‌కు గతంలో రూ.10 చెల్లిస్తే దాన్ని ఇప్పుడు రూ.100 చేశారు. రికార్డుల తనిఖీ వంటి వాటికి కూడా గతంలో రూ.10, ప్రస్తుత ఏడాదికాకుండా గతేడాదికి రూ.10 చొప్పున చెల్లించాల్సి ఉండేది. కానీ ఇది కూడా రూ.100 చేసేశారు. వివాహం చేసుకుంటున్న కళ్యాణ మండపానికో, గుడి దగ్గరకో రిజిస్ట్రార్ వచ్చి వివాహ రిజిస్ట్రేషన్ చేస్తే దీనికి రిజిస్ట్రార్ ఫీజు రూ.1100 చెల్లించాల్సి ఉండేది. దీన్ని ఏకంగా రూ.5వేలు పెంచేశారు. సెలవురోజుల్లో రిజిస్ట్రేషన్ చేయాలంటే మరో రూ.5వేలు చెల్లించుకోవాల్సిందే. ఇది రికార్డుల ప్రకారం చెల్లింపు మాత్రమే.

ప్రభుత్వ ఆదేశాల మేరకే..

ప్రభుత్వం ఆదేశాల మేరకే ఫీజుల పెంపు ఉంటుంది. నిర్దేత ధరల కంటే అధికంగా వసూలు చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకున్నారు. మధ్యవర్తులను ఆశ్రయించాల్సిన పనిలేదు. నిబంధనల ప్రకారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు.

-రామలక్ష్మీ పట్నాయక్, జిల్లా రిజిస్ట్రార్, కాకినాడ

సాగరతీరంలో సైనిక విన్యాసాలకు కసరత్తు



తీరంలో సైనిక బలగాలు

సర్పవరం జంక్షన్, జనవరి 28: కాకినాడ సాగరతీరం సూర్యారావుపేట నావెల్ ఎన్‌క్లేవ్‌లో భారత తూర్పు నావికా దళం, ఆర్మీలు సంయుక్తంగా విన్యాసాలు నిర్వహించాయి. సముద్రంలో డీప్ సీలో తొమ్మిదిరోజులుగా నావికా విన్యాసాలు నిర్వహిస్తున్నారు. ముగింపులో భాగంగా ఆది, సోమవారం విన్యాసాల కోసం నేవీ, ఆర్మీ బృందాలు కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవెల్ ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లోకి చేరుకున్నాయి. యుద్ధం, తుపాన్లు, విపత్తులు, భూభాగంలోకి అక్రమ చొరబాట్లు, ఆపద సమయాల్లో సముద్రం, ఆకాశయానం, భూమి పై నుంచి చేపట్టే కసరత్తును నిర్వహించినట్లు తెలిసింది. ఈ సైనిక విన్యాసాలపై అధికారికంగా ఎటువంటి సమాచారాన్ని నేవీ, ఆర్మీ అధికారులు మీడియాకు వెల్లడించలేదు. సోమవారంతో ఈ కసరత్తు ముగిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆదివారం యుద్ధ ట్యాంకులు, ఆర్మీ సిబ్బంది, నేవీ సిబ్బంది నేవెల్ ప్రాంతంలో సైనిక కసరత్తు ప్రక్రియను నిర్వహించారు.

లోవ ఆలయానికి రూ.4.77లక్షల ఆదాయం

తుని రూరల్, జనవరి 28: లోవదేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనార్థం తెలుగు రాష్ట్రాల నలుమూలలనుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం భక్తజన కోలాహలంగా మారింది. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఈవో విశ్వనాథ్‌రాజు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకున్న భక్తుల ద్వారా వివిధ విభాగాలనుంచి రూ.4,77,327 సమకూరినట్లు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

సామర్లకోటలో దొంగల హల్‌చల్

- ఆలయంలో చోరీకి యత్నం

సామర్లకోట, జనవరి 28: సామర్లకోట పీబీసీ కెనాల్ ఎదురుగా ఉన్న హరిహర క్షేత్రం అన్నపూర్ణాసమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున నలుగురు దొంగలు గంటన్నరసేపు హల్‌చల్ చేశారు. ఆలయ తాళాలు పగలకొట్టి లోనికి ప్రవేశించి దేవతామూర్తులకు అలంకరణగా ఉన్న ఆభరణాలను తీసి పరిశీలించి అవి బంగారు ఆభరణాలు కాదని నిర్ధారించి విడిచిపెట్టారు. మూడు దేవతామూర్తుల మందిరాల తాళాలను బలమైన ఇనుప రాడ్‌లతో తొలగించారు. ఆలయ ఆవరణలో ఉన్న హుండీ తాళాలు పగలకొట్టి రూ.వెయ్యి నగదు మాత్రమే చోరీ చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న అర్చకుడి మోటార్‌సైకిల్ చోరీకి యత్నం చేసినా ఫలించకపోవడంతో దొంగలు వచ్చిన దారినే తిరుగు పయనమయ్యారు. చోరీ జరిగిన సమయంలో ఆలయ వ్యవస్థాపకులు, మరో ఇద్దరు వ్యక్తులు లోపలి గదుల్లో నిద్రించడంతో దొంగలు యథేచ్ఛగా తమ వెతుకులాట కొనసాగించారు. ఈ దృశ్యాలు ఆలయ ఆవరణలో ఉన్న సీసీ ఫుటేజీల్లో నిక్షిప్తమయ్యాయి. సామర్లకోట పోలీసులకు ఆలయ వ్యవస్థాపకులు పరమానందగిరి స్వామీజీ ఫిర్యాదు చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక దర్యాప్తు నిర్వహించారు. పోలీసులు రాత్రివేళల్లో పహారా తిరగకపోవడంతో ఇటీవల కాలంలో చోరీలు పెరిగాయన్న ఆందోళనలు అధికమయ్యాయి. ఆయా చోరీ సంఘటనలకు చెందిన సీసీ ఫుటేజీలను పోలీసులకు అందించినా ఫలితం ఉండడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

కొత్త జేసీగా ప్రవీణ్ ఆదిత్య

- జేసీ ఇలాక్కియ పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు పరిపాలనాధికారిగా బదిలీ



కాకినాడ సిటీ, జనవరి 28: రాష్ట్రంలోని ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా కాకినాడ జిల్లా జేసీ ఎస్.ఇలాక్కియ బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలనశాఖ ముఖ్యకార్యదర్శి జవహర్‌రెడ్డి ఆదివారం జీవో నెంబరు 172 ఉత్తర్వులు జారీ చేశారు. జేసీ ఇలాక్కియాను పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు పరిపాలనాధికారిగా బదిలీ చేశారు. అక్క డే విధులు నిర్వర్తిస్తున్న ప్రవీణ్ ఆదిత్యను కాకినాడ జేసీగా నియమించారు. వీరిద్దరూ పరస్పర బదిలీల్లో భాగంగా మారారు. వీరు భార్యభర్తలు కావడం విశేషం. జేసీగా పనిచేసిన రెండేళ్లలో ఇలాక్కియ తనదైన ముద్ర వేసుకోలేకపోయారు. రైతులనుంచి ధాన్యం సేకరణలో విఫలం కావడంతో పలుమార్లు రైతులు రోడ్డెక్కారు. పంటనష్టం అంచనాలు, పరిహారం చెల్లింపులో ఏ మాత్రం పట్టించుకున్న దాఖలాలు ఆరోపణలున్నాయి. రామేశ్వరంమెట్ట, ఇతర ప్రాంతాల్లో మైనింగ్ అక్రమాలు యథేచ్ఛగా జరిగినా కట్టడి చేయలేకపోయారన్న అపవాదు ఉంది. ధాన్యం సేకరణలో రైతులను ఖాతరు చేయకుండా రైస్ మిల్లర్లకు అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఇలాక్కియ జేసీగా కాకినాడ జిల్లాలో రెండేళ్ల కాలానికి తక్కువే పనిచేశారు.

తప్పుడు ఫారం-7 దాఖలుపై ఈసీ కొరడా

- పిఠాపురంలో ఆరుగురిపై కేసు నమోదు

పిఠాపురం, జనవరి 28: ఓటర్ల జాబితాలు నుంచి పేర్లు తొలగింపునకు తప్పుడు ఫిర్యాదులు చేసిన వారిపై ఈసీ కొరడా ఝుళిపించింది. తప్పుడు దరఖాస్తులు చేసిన ఆరుగురిపై పిఠాపురం పట్టణ, రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరంతా వైసీపీ నాయకులే కావడం గమనార్హం. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా పిఠాపురం పట్టణం, మండలంలోని ఓటర్లు తొలగింపునకు పలువురు ఫారం-7దరఖాస్తులు దాఖలు చేశారు. కొందరు వ్యక్తుల పేరుతో పది నుంచి 40 వరకూ ఓట్ల తొలగింపునకు దరఖాస్తులు అందాయి. ఇవన్నీ ఆన్‌లైన్‌లో దాఖలు కావడం, ఒకే వ్యక్తిపై పేరు మీద ఉన్నవి కావడంతో ఏఈఆర్‌వోల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ జరిపించారు. ఇవన్నీ తప్పుడు దరఖాస్తులుగా అధికారుల విచారణలో వెల్లడయింది. ఇదే సమయంలో అధికార పార్టీ నేతలు తప్పుడు ఫారం-7 దరఖాస్తులు దాఖలు చేసి ఓట్లు తొలగింపునకు కుట్రపన్నారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా వ్యాప్తంగా ఇటువంటి దరఖాస్తులపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఈసీ ఆదేశించింది. దీంతో పిఠాపురం పట్టణంలో ఇద్దరు, మండలంలో నలుగురిపై పట్టణ, రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులు నమోదైన వారంతా వైసీపీ నాయకులే. కాగా కొత్తపల్లి మండలంలో నలుగురు వ్యక్తులు, గొల్లప్రోలు మండలంలో నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. పిఠాపురం నియోజకవర్గం మొత్తం మీద 14మందిపై కేసులు నమోదయ్యాయి. వీరంతా వైసీపీ నాయకులేనని పోలీసులు చెబుతున్నారు. వీరిలో కొందరు ప్రజాప్రతినిధులు ఉండడం విశేషం.

ఓపీఎస్ ఇచ్చే పార్టీలకే ఉద్యోగుల ఓటు

- ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ
- ఓట్ ఫర్ ఓపీఎస్ సభలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూటీఎఫ్ నేతలు

(3వ)

రాజమహేంద్రవరంలో వైభవంగా హిందూ సంగమం

(3వ)

నష్టాల్లో మిర్చి రైతు



యర్రంపాలెంలోని పొలాల్లో పంటపై ఉన్న ఎండు మిర్చి

- వర్షాలకు నాణ్యత లోపించి తెలుపు రంగులోకి మారిన ఎండుమిర్చి
- క్వింటా రూ.5వేల నుంచి రూ.6వేలకు పలుకుతున్న ధర
- రైతుల గగ్గోలు

గండేపల్లి, జనవరి 28: గడిచిన రెండేళ్లలో ధర అధికంగా పలికి దిగుబడి బాగుండడంతో ఎండుమిర్చి రైతులకు సిరులు కురిశాయి. ఈ సంవత్సరం వర్షాల ప్రభావంతో నష్టాలు రావడంతో వారు గగ్గోలు పెడుతున్నారు. ఎకరానికి రూ.లక్షపైనే నష్టం వస్తుందని చెబుతున్నారు. ఈ సంవత్సరం పంట ఆశాజనకంగా ఉన్నా కాయలు ఉన్న దశలో మిచాంగ్ తుపాను కారణంగా వారం రోజులపాటు కురిసిన వర్షాలకు పంట పూర్తిగా నాణ్యత లోపించింది. దీంతో ఎండుమిర్చి తెలుపు రంగులోకి వచ్చి డొల్లకాయలుగా మారాయని రైతులు అంటున్నారు. దీంతో వ్యాపారులు క్వింటా రూ.5వేలనుంచి రూ.6వేలకు కూడా కొనుగోలు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదని రైతులు చెబుతున్నారు. దిగుబడి కూడా ఎకరానికి 5 నుంచి 6 క్వింటాళ్లు మాత్రమే వస్తుందని అంటున్నారు. దీంతో ఎకరానికి ఆదాయం రూ.50వేలు కూడా వచ్చే పరిస్థితి లేదంటున్నారు. క్వింటా కాయలు కోయడానికి కోత కూలి రూ.2500 అవుతుందన్న కారణంగా కొంతమంది రైతులు కాయలు కోయకుండా పంటపొలాల్లో వదిలేసే పరిస్థితి ఏర్పడింది. ఎకరానికి రూ.1.50లక్షలు పెట్టుబడి పెట్టామని, రైతు కష్టం పోయినా ఇంకా రూ.లక్ష వరకు నష్టం వస్తుందని రైతులు అంటున్నారు. ఈ సంవత్సరం తమను వర్షాలు నిండా ముంచాయని మిర్చి రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది ఎకరానికి 20నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని ధర కూడా క్వింటా రూ.25వేలు ధర పలకడంతో పెట్టుబడులు పోయి రూ.1.50లక్షలు ఆదాయం వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా ఆదాయం బాగుంటుందని మిరప సాగు చేపబడితే వర్షప్రభావంతో పూర్తిగా పంట నష్టపోయామని రైతులు గగ్గోలు పెడుతున్నారు. జిల్లాలో అత్యధికంగా గండేపల్లిలో 350ఎకరాలకు పైగా మిర్చిసాగు చేపట్టారు. పంట నష్టపోయినా ప్రభుత్వంనుంచి స్పందన లేని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీలోకి చేరిక

రౌతులపూడి, జనవరి 28: రౌతులపూడి మండలం శృంగవరం గ్రామంలో 100మంది వైసీపీకి చెందిన వారు టీడీపీలోకి చేరారు. మాజీ సర్పంచ్ లొండా దేవుళ్లు, మాజీ ఎంపీటీసీ వాసం సాంబశివరావు అధ్వర్యంలో గాది రాంబాబు, బొంగునానితోపాటు 100మంది టీడీపీలోకి చేరగా వీరికి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ పార్టీ జెండా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ జనంలో విశ్వాసం కోల్పోయిందన్నారు. భవిష్యత్‌లో టీడీపీదే అధికారమని, జగన్ ఇంటికి వెళ్లాల్సిందేనని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీలు గంటిమళ్ల రాజ్యలక్ష్మి, గొల్లపల్లి బుజ్జీ, పార్టీ నాయకులు పర్వత సురేష్, సింహాద్రి పెదబాబు, జెట్లా రాజా, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరావు, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, అల్లు నూకరాజు పాల్గొన్నారు.



టీడీపీలోకి చేరిన వారితో ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యప్రభ

నేడు జిల్లాస్థాయి 'స్పందన'

కాకినాడ సిటీ, జనవరి 28: జగనన్నకు చెబుదాం.. జిల్లాస్థాయి స్పందన ప్రజావినతుల స్వీకరణ సోమవారం ఉదయం 9.30గంటలనుంచి కాకినాడ కలెక్టరేట్ స్పందన హాల్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. అర్జీదారులు, జిల్లా అధికారులు ఈ విషయాన్ని గమనించాలని కలెక్టర్ సూచించారు.

ప్రైవేటు పాఠశాలల సమస్యలు మా దృష్టికి తెస్తే పరిష్కరిస్తాం

- ఆర్‌జేడీ నాగమణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్‌జేడీ నాగమణి

కాకినాడ సిటీ, జనవరి 28: ప్రైవేటు పాఠశాలల సమస్యలు అధికారుల ద్వారా తమ దృష్టికి తెస్తే తప్పక పరిష్కరిస్తామని పాఠశాల విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి అన్నారు. యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో ఆదివారం కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా ప్రైవేట్ పాఠశాలల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఫెడరేషన్ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ అధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆర్జేడీ నాగమణి విచ్చేశారు. విశిష్ట అతిథులుగా ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ ఎస్.పూర్ణచంద్రరావు, రామచంద్రపురం మోడరన్ విద్యాసంస్థల చైర్మన్ జీవీ రావు, ఆదర్శ విద్యాసంస్థల చైర్మన్ బి.అనుబాబు పాల్గొన్నారు. సమావేశానికి ఫెడరేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా తొలుత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆర్జేడీ నాగమణి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో పాలనాపరమైన అంశాలు, రికార్డుల నిర్వహణ, విద్యాప్రమాణాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర అంశాలను యాజమాన్యాలకు వివరించారు. సమావేశంలో ఫెడరేషన్ సభ్యులు సుజ్ఞాన్, నారాయణ ప్రకాష్, ఇదయతుల్లా, పెద్దసంఖ్యలో కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



జేఎన్టీయూకే పట్టాల పండుగ

రాష్ట్రంలో అతిపెద్ద సాంకేతిక విశ్వవిద్యాలయమైన కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవాన్ని ఈనెల 31న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 10వ స్నాతకోత్సవ నిర్వహణకు ఇప్పటికే విశ్వవిద్యాలయ కులపతి, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీఎస్సీహెచ్ఈ ఛైర్మన్ కె.హేమ చంద్రారెడ్డి ఆమోదం తెలిపారు.

31న జేఎన్టీయూకే పదో స్నాతకోత్సవం

హాజరుకానున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం

వర్సిటీ ఆవరణలో చురుగ్గా ఏర్పాట్లు

టీసీఎస్ ప్రెసిడెంట్‌కు గౌరవ డాక్టరేట్

ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఉపకులపతి.



వర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా టీసీఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేయనున్నాం. ఇది ప్రతీ విద్యార్థి జీవితంలో మరచిపోలేని వేడుక కులపతి హోదాలో హాజరవుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా విద్యార్థులకు పట్టాలు, పతకాలు, పరిశోధక విద్యార్థులకు పీహెచ్‌డీ పట్టాలు అందజేయనున్నారు. స్నాతకోత్సవాన్ని ప్రణాళికాబద్ధంగా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

పట్టాల ప్రదానం ఇలా..

10వ స్నాతకోత్సవంలో 2022-23 విద్యా సంవత్సరాలకు సంబంధించి బీటెక్-34199, బీఫార్మసీ 1477, బీబీఏ-21, ఫార్మా డీ-182, బీఆర్క్-18 మొత్తం యూజీలో 35,897 (ఒరిజినల్ డిగ్రీ) పట్టాలను ప్రదానం చేయనున్నారు. అదే విధంగా ఎంటెక్-1689. ఎంబీఏ-1093, ఎంసీఏ-343, ఎం ఫార్మసీ-32 మొత్తం పీజీలో 1468 ఓడీ పట్టాలను, 24 మంది విద్యార్థులకు బంగారు, 4 నగదు పతకాలను, సుమారు 64 మందికి పీహెచ్‌డీ పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందజేయనున్నారు. స్నాతకోత్సవంలో పట్టాలు తీసుకునేందుకు 4 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు.

గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక

జేఎన్టీయూకే, జనవరి 28: 2008లో విశ్వవిద్యాలయంగా రూపుదిద్దుకున్న జేఎన్టీయూకే మొదటి ఉపకులపతిగా అల్లం అప్పారావు, రెండో వీసీగా జి.తులసీరామ్‌దాస్, 3వ వీసీగా వీఎస్ఎస్‌కుమార్, 4వ వీసీగా ఎం.రామలింగరాజు వ్యవహరించగా 5వ వీసీగా ప్రస్తుతం జీవీఆర్ ప్రసాదరాజు కొనసాగుతున్నారు. స్నాతకోత్సవానికి కులపతి హోదాలో హాజరు కావాలని వీసీ జీవీఆర్ ప్రసాదరాజు ఆధ్వర్యంలోని వర్సిటీ బృందం రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు ఆహ్వానపత్రికను అందించింది. మాజీ ఉపకులపతి అల్లం అప్పారావు హయాంలో జేఎన్టీయూకే 1వ స్నాతకోత్సవాన్ని, డాక్టర్ జి.తులసీరామ్‌దాస్ హయాంలో 2,3,4వ స్నాతకోత్సవాలను, వీఎస్ఎస్ కుమార్ హయాంలో 5, 6వ స్నాతకోత్సవాలను, ఎం.రామలింగరాజు హయాంలో 7వ స్నాతకోత్సవాన్ని నిర్వహించగా ప్రస్తుత ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ప్రసాదరాజు హయాంలో 8,9వ స్నాతకోత్సవాలను ఇప్పటికే నిర్వహించగా ఈనెల 31న పదో స్నాతకోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



అతిథులు వీళ్లే..

జేఎన్టీయూకే కులపతి, రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మాజీ నేవీ రియర్ అడ్మిరల్ ఎస్.వెంకటశేషాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి స్నాతకోత్సవ ఉపన్యాసం ఇస్తారు. ప్రత్యేక అతిథిగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పాల్గొంటారని వర్సిటీ వర్గాలు తెలిపాయి. జేఎన్టీయూకే తరఫున గౌరవ డాక్టరేట్‌ను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్) టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్నకు ప్రదానం చేయనున్నారు. అంతే కాకుండా స్నాతకోత్సవానికి మాజీ ఉపకులపతులు, పాలక మండలి సభ్యులు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని అధికారులు, విద్యావేత్తలు, పూర్వ విద్యార్థులను ఆహ్వానించినట్లు తెలిపారు.

ఓపీఎస్ ఇచ్చే పార్టీలకే

ఉద్యోగుల ఓటు

సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించాలి

ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు

ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణ

ఓట్ ఫర్ ఓపీఎస్ సభలో పీడీఎఫ్ ఎమ్మెల్సీలు, యూటీఎఫ్ నేతలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 28 : ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెన్షన్ భిక్ష కాదు హక్కు అని, పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరించే రాజకీయ పార్టీలకే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రవ్యాప్త పాత పెన్షన్ సాధన సభ నిర్వహించారు. ఓట్ ఫర్ ఓపీఎస్ అంటూ నినాదాలు చేశారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్ తెచ్చిన వారిని ఓడించేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుల న్యాయమైన ఆందోళనా కార్యక్రమాలను ప్రభుత్వం పోలీసుల సహకారంతో అణచివేయాలనుకోవడం సరికాదన్నారు. ఉపాధ్యాయులను హేబిట్యువల్ అఫెండర్స్ (అలవాటైన నేరస్థులు)గా పరిగణించడం దారుణమని అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఓపీఎస్‌ను తమ మేనిఫెస్టోలో చేర్చడంతో పాటు మొదటి సంతకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీపీఎస్ డొల్ల అని, గ్యారంటీ లేని పెన్షన్‌కు గ్యారంటీ అని పేరు పెట్టడం విడ్డూరమని అన్నారు. ఉపాధ్యాయులంతా ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12 నుంచి మండల స్థాయిలో, 18 నుంచి 21వ తేదీ వరకూ నియోజకవర్గ స్థాయిలో, 25 నుంచి 28వ తేదీ వరకూ జిల్లాస్థాయిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులను కలిసి వినతిపత్రాలు అందజేయాలని చెప్పారు. మార్చి 15 తర్వాత చర్చా వేదికలు నిర్వహిస్తామన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారాం మాట్లాడుతూ పాత పెన్షన్ సాధనకు జరిగే పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ఓట్ ఫర్ ఓపీఎస్‌కు ఏ రాజకీయ పార్టీ నుంచి మద్దతు లభించకపోతే శాసనసభలకు సొంతంగా ప్రతినిధులను పంపేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విశాలమైన ప్రజా సమీకరణతో ఎవరు ముఖ్యమంత్రి అవ్వాలో నిర్ణయించే శక్తిగా మారాలని సూచించారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు మనోహర్, అరుణకుమారి, గోపి, మూర్తి, జ్యోతిబసు, సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన ఉద్యోగులు, సంఘాల నేతలు

ధర్మవరంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న వరుపుల సుబ్బారావు



ప్రత్తిపాడు, జనవరి 28: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో గౌరీశంకర్ల 87వ వార్షికోత్సవ మహోత్సవంలో భాగంగా ఆదివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించారు. పేర్రాజు చెరువు సమీపంలోని పుష్కర కాలువ గట్టుపై ఈ పోటీలు నిర్వహించగా పోటీలను మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. సీనియర్స్ విభాగంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా గుమ్మలేరుకు చెందిన కోరా శృతి చౌదరి ఎడ్ల జతకు ప్రథమ బహుమతి లభించింది. కాకినాడ జిల్లా గొల్లప్రోలుకు చెందిన నిమ్మకాయల నూకరాజు ఎడ్ల జతకు ద్వితీయ స్థానం, తూర్పుగోదావరి జిల్లాలోని చెముడులంకకు చెందిన నాగిరెడ్డి నారాయుడుకు చెందిన ఎడ్ల జతకు తృతీయ బహుమతి లభించింది. జూనియర్స్ విభాగంలో కాకినాడ జిల్లా కొవ్వాడకు చెందిన మట్టా నవనీన్ శ్రీ మణికంఠ ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచింది. గొల్లప్రోలు మండలం వన్నెపూడికి చెందిన బదిరిశెట్టి మణి ఎడ్ల జత ద్వితీయ స్థానం, అనకాపల్లిజిల్లా చౌడవాడకు చెందిన గెడ్డం అప్పారావు ఎడ్ల జతకు తృతీయస్థానం లభించాయి. సీనియర్స్, జూనియర్స్ విభాగంలో మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి, జడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, ఎంపీటీసీ జువ్వల సుజాతబాబులు బహుమతులు, షీల్డులు ప్రదానం చేశారు. ఈ పోటీలకు విశాఖ, అనకాపల్లి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణ, తెలంగాణాకు చెందిన 43 ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో 7 ఎడ్ల జతలు, జూనియర్స్ విభాగంలో 36 ఎడ్ల జతలు ఈ పోటీల్లో తలపడ్డాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా ఉల్లాసంగా ఈ పోటీలు నిర్వహించడంతో పేర్రాజు చెరువు పుష్కర కాలువ గట్టు జనసంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ఎడ్ల జతలు రావడంతో ఎడ్లకు అవసరమైన తాళ్లు, కొరడాలు, ఇతర సామగ్రి అమ్మకం దుకాణాలు పోటీల ప్రదేశాల్లో వెలిశాయి. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా చేకూరి రామకృష్ణ, యనమల కృష్ణ, కంటే పణికుమార్ వ్యవహరించారు. విజేతలకు షీల్డ్ , నగదు బహుమతులు అందించారు. బహుమతుల దాతలుగా ముదునూరి మురళీకృష్ణంరాజు, బి.సుశీల అబ్బాయి, కిల్లాడి బాబ్జీ, ఇంధన ఏసుబాబు బాబ్జీ, పైలా ఏసుబాబు, చెక్కపల్లి రాంబాబు తదితరులు వ్యవహరించారు. పెద్దలు దాట్ల అప్పన్నబాబు, జువ్వల చినబాబు, కోలా తాతబాబు, బొల్లు సీతారామరాజు, జె.బాబులు, సానా నూకరాజు, దాడి చిన్నారావు, దొడ్డిపట్ల సోమన్నదొర తదితరులు తోడ్పాటు అందించారు.

500 ఏళ్ల తర్వాత

రాముడు గెలిచాడు

గుడికట్టేవాడిని గుండెల్లో పెట్టుకుందాం

శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామీజీ

రాజమహేంద్రవరంలో వైభవంగా హిందూ సంగమం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/కల్చరల్, జనవరి 28: రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణం ఆదివారం సాయంత్రం 'జై శ్రీరామ్.. భారత్ మాతాకీ జై.. వందేమాతరం' నినాదాలతో మార్మోగింది. కాషాయ జెండాలు కళకళలాడాయి. శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో భారీ హిందూ సంగమం అంగరరంగ వైభవంగా నిర్వహించారు. వందలాది మంది హాజరయ్యారు. శ్రీపీఠం పీఠాధిపతి స్వామి పరిపూర్ణానంద సరస్వతి మాట్లాడుతూ 'భారతదేశ ఉనికి, అస్తిత్వం 2024 జనవరి 22న ప్రారంభమైందన్నారు. ఆ రోజున ప్రపంచమంతా భారతదేశ గొప్పతనం, అయోధ్య నగరి వైపు చూసిందని తెలిపారు. 1524-25 మధ్యలో అయోధ్యలో రామమందిరాన్ని కూల్చేశారు. 500 ఏళ్ల తర్వాత సర్వోన్నత న్యాయస్థానంలో రాముడు గెలిచాడు. రామ మందిరాన్ని నిర్మించుకున్నాం. ప్రధాని మోదీ దేశంలోని ఉజ్జయిని అనే క్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాడు. జ్యోతిర్లింగమైన కేదారినాథ్‌ని ఉద్ధరించి చూపించారు' అని తెలిపారు. శ్రీశైలం క్షేత్రానికి రూ.వెయ్యి కోట్లు మంజూరు చేయబోతున్నట్లు చెప్పారు. గుడి కట్టేవాడిని గుండెల్లో పెట్టుకుందామా..గుడి కొట్టేవాడికి ఓటేద్దామా?..మన ఓటు గుడి కట్టేవాడికి మాత్రమే వేయాలని పిలుపునిచ్చారు. హిందూపురంలో కాషాయాన్ని ఎగురవేసి చూపి స్తామన్నారు. ఏప్రిల్‌లో మనం మన చూపుడు వేలుతో సిద్ధంగా ఉండాలి. బేషరతుగా జైశ్రీరాం అంటూ పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి పువ్వు కనిపిస్తే ఓటేయాలి' అని పరిపూర్ణానంద పిలుపునిచ్చారు. హిందూ జాగరణ సమితి నాయకుడు అలే శ్యాం మాట్లాడుతూ హిందువులంతా సంఘటితంగా ఉంటే భారతదేశం బలమైన శక్తిగా విరాజిల్లుతుందన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడిచినా ఇంకా మనకు పూర్తి స్వాతంత్ర్యం రాలేదన్నారు. 'దేశంలో మత మార్పిడులు పెద్ద ఎత్తున జరుగుతున్నాయన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో దేశంలో ఎక్కడా లేనంతగా జరుగుతున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరంలోని నందరం గనిరాజు జంక్షన్‌లో అతి త్వరలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎంపీ భరత్‌రామ్ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, శక్తి ప్రదర్శనలు, గీతాలాపనలు అలరించాయి. బీజేపీ నేతలు బొమ్ముల దత్తు, కురగంటి సతీశ్, శ్రీ రామ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వైష్ణవ దినేశ్, డాక్టర్ కర్రి రామారెడ్డి పాల్గొన్నారు.

సభకు హాజరైన హిందువులు



పరిహారం ఇవ్వకుంటే పోరాటమే

యానాం, జనవరి 28: యానాం నియోజకవర్గంలో మత్స్యకారులకు రావలసిన పరిహారంపై యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం దూకుడు పెంచింది. పుదుచ్చేరి ప్రభుత్వం ఇచ్చిన మత్స్యకారుల జాబితా ఆధారంగా ప్రభుత్వ ఖాతాలో నగదు జమ చేయకుంటే ఫిబ్రవరి రెండో తేదీన పరిశ్రమ వద్ద ఆందోళనకు సిద్ధమని సంఘం హెచ్చరించింది. మత్స్యకార నాయకుడు, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో స్థానిక అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం మత్స్యకారుల సమావేశం జరిగింది. గత రెండు సంవత్సరాలుగా నష్టపరిహారం విషయంలో చేసిన విశేష కృషి ఫలితంగానే ఈ స్థితికి చేరుకున్నామని, ఇప్పుడు పరిశ్రమ నుంచి అడ్డంకులు వస్తున్నాయని వాటిని ఏవిధంగా అధిగమించాలనే అంశాలపై చర్చించారు. ఆంధ్రాలో ఇప్పటికే నాలుగు విడతలు పరిహారం ఇచ్చినప్పటికీ యానాంలో మాత్రం ఒక్క విడతే ఇస్తామని, దీనిపై అటు పరిశ్రమ, ఇటు ప్రభుత్వం కాలయాపన చేస్తోందని పలువురు మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రధానంగా రెండు అంశాలపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈనెలాఖరునాటికి ఓఎన్‌జీసీ సంస్థ ప్రభుత్వ ఖాతాలో పరిహారం జమ చేయకుంటే ఫిబ్రవరి రెండో తేదీన యానాం-గిరియంపేట రోడ్డులోని ఓఎన్జీసీ పరిశ్రమ ఎదురుగా మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఆందోళనకు సిద్ధమన్నారు. తదపరి గ్రామాల వారీగా ఆందోళనకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని నిర్ణయించారు. అదే విధంగా చమురు సంస్థ ప్రభుత్వ ఖాతాలో జమ చేస్తే ఫిబ్రవరి 15 నాటికి (పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ లోపు) లబ్ధిదారుల ఖాతాలో జమ చేయకుంటే మత్స్యకారులందరూ ఎన్నికలను బహిష్కరించనున్నామని తెలిపారు. ఏ పార్టీ అయినా తాము ఓటు వేయకుండా తమ నిరసనను తెలుపుతామన్నారు. ఇందుకు సంబంధించిన అంశాలపై యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం రాతపూర్వకంగా ఓఎన్జీసీ, పుదుచ్చేరి ప్రభుత్వ అధికారులకు ఇతర ప్రతినిధులకు ఇస్తామన్నారు. కార్యక్రమంలో యానాం అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శేరు కృష్ణ, మల్లాడి శామ్యూల్, చింతా వెంకటేశ్వర్లు, మల్లాడి విష్ణు, మల్లాడి రాజు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీలు ఆక్సిజన్ ఫ్యాక్టరీలు



నర్సరీని పరిశీలిస్తున్న డాక్టర్ నాగేశ్వరరెడ్డి

కడియం, జనవరి 28: కడియం నర్సరీలు స్వచ్ఛమైన ఆక్సిజన్ అందించే ఫ్యాక్టరీలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ(ఏఐజీ) ఛైర్మన్ డాక్టర్ నాగేశ్వరరెడ్డి ప్రశంసించారు. కడియపులంక పుల్లా వీరవెంకట రావు-సత్యదేవా నర్సరీని ఆదివారం ఆయన సందర్శించారు. వారికి నర్సరీ రైతు వీరవెంకటరావు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. నాగేశ్వరరెడ్డి నర్సరీల్లోని వివిధ రకాల మొక్కలను తిలకించారు. కడియం నర్సరీలను సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన వైద్య బృందంతో మరోసారి వచ్చి కడియం నర్సరీలను సందర్శిస్తామన్నారు. కార్యక్రమంలో పుల్లా సత్యనారాయణ (చంటియ్య), పుల్లా ఆంజనేయులు (అబ్బులు), పుల్లా రామారావు, పెద సత్యనారాయణ, వీర్రాజు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కస్తూరి సుబ్రహ్మణ్యం, పుల్లా శ్రీకాంత్ పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో గంజాయి రవాణా!



గంజాయి అంబులెన్స్ ఇదే..

మోతుగూడెం, జనవరి 28: గంజాయి అక్రమ రవాణా కొత్త పుంతలు తొక్కుతోంది. కొత్తగా అంబులెన్స్ మాదిరి వాహనాలను వినియోగిస్తున్నారు. అంబులెన్స్ అనుకుని పోలీసులు ఆపకుండా వదిలేస్తారని వారి తెలివితేటలు. అయితే పోలీసులు అలాంటి వారి ఆట సైతం కట్టిస్తున్నారు. మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం అంబులెన్స్ మాదిరి గంజాయి రవాణా వాహనాన్ని పట్టుకున్నారు. 500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చింతూరు అడిషనల్ ఎస్పీ రాహుల్‌మీనా వివరాలు తెలిపారు. గంజాయిని మోతుగూడెం నుంచి రాజస్థాన్‌లోని జ్యోతిపూర్‌కు తరలిస్తున్నారన్నారు. ఒడిసాకు చెందిన రామారావును అదుపులోకి తీసుకున్నామన్నారు. రాజస్థాన్, ఒడిసాకు చెందిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారని చెప్పారు. గంజాయి విలువ రూ.25 లక్షలు ఉంటుందన్నారు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు, ఏఎస్ఐలు టి.రాజేశ్వరరావు, సూర్యనారాయణ, నూకరాజు, హెడ్ కానిస్టేబుల్ యుఆర్‌కె రాజు రమేష్, మురళి, శ్రీనివాస్, పోలీసులు సన్ని, బషీర్ ఉన్నారు.

24 గంటల్లో దొంగ ఆట కట్టించారు



సొత్తును స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాజమహేంద్రవరం, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బొమ్మూరు పోలీసులు 24 గంటల్లో దొంగ ఆట కట్టించారు. నెల్లూరు జిల్లాకు చెందిన వెల్లిబోయిన వినయ్ దైవ దర్శనానికి 26న పిఠాపురం వచ్చాడు. అక్కడ ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. ఇద్దరూ సాయంత్రానికి రాజమహేంద్రవరం వచ్చి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మెట్రో లాడ్జిలో దిగారు. ఉదయం నిద్ర లేచి చూసే సరికి కెమెరా, ల్యాప్‌టాప్, ఆ వ్యక్తి కనిపించలేదు. దీంతో వినయ్ బొమ్మూరు పోలీసులను ఆశ్రయించాడు. సీఐ ఎండీ ఉమర్ ఆధ్వర్యంలో ఎస్ఐ జగన్ మోహన్ తన సిబ్బందితో రంగంలోకి దిగారు. సీసీ కెమెరాలు ఆధారంగా కాకినాడకు చెందిన పిల్లారిశెట్టి శ్రీనివాస్‌ని నిందితుడిగా గుర్తించి ఆదివారం అరెస్టు చేశారు. సుమారు రూ.1.20లక్షల విలువ చేసే చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. కేసు పరిష్కారంలో ప్రతిభ చూపిన సీఐ ఉమర్, ఎస్ఐ జగన్, ఏఎస్ఐ ఏకే సత్యనారాయణ, పీసీ సురేశ్‌ని ఎస్పీ జగదీశ్ అభినందించారు.

కిరాణా, ఎలక్ట్రికల్ షాపులో అగ్నిప్రమాదం

రూ. 10 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన కిరాణా సరుకులు

అంబాజీపేట, జనవరి 28: అంబాజీపేట బస్టాండ్‌కు వెళ్లేదారి బీఎస్ ఎన్ఎల్ కార్యాలయం సమీపంలో ఓ కిరాణా, ఎలక్ట్రికల్ షాపులో శనివారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో రూ. 10 లక్షలు విలువైన కిరాణా సరుకులు, ఎలక్ట్రికల్ సామాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. అంబాజీపేటకు చెందిన సత్తి త్రిమూర్తులు ఇటీవల గణపతి ఎలక్ట్రికల్ అండ్ కిరాణా స్టోర్స్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. శనివారం అర్ధరాత్రి షాపులో వెనుక భాగంలో ఉన్న ఇన్వేటర్ ద్వారా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి అక్కడ ఉన్న నూనె ప్యాకెట్లకు మంటలు వ్యాపించాయి. దీంతో ఈ మంటలు షాపంతా వ్యాపించగా షాపులో నూనె, కిరాణా సామగ్రి, ఎలక్ట్రికల్ సామన్లు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో రూ.10లక్షలకు పైగా నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. సంఘటన స్థలాన్ని అమలాపురం అగ్నిమాపక అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు, అమలాపురం చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, సుంకర బాలాజీ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, అంబాజీపేట కిరాణా సంఘం అధ్యక్షుడు కాసు రాజా పండు తదితరులు పరిశీలించారు.

పంపా నది ఒడ్డున మృతదేహం

తుని రూరల్, జనవరి 28: కాకినాడ జిల్లా అన్నవరంలో పంపానది ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం కలకలం రేపింది. సుమారు 25 ఏళ్ల వయస్సు ఉన్న యువకుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. సంబంధీకులు అన్నవరం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలి

ఏపీ ఆర్యవైశ్య మహాసభలో వక్తలు పిలుపు



మాట్లాడుతున్న శ్రీఘాకోళ్లపు శివరామసుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 28: ఆర్యవైశ్యులు రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని ఏపీ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం చెరుకూరి కల్యాణ మండపంలో ఏపీఐఐసీ మాజీ ఛైర్మన్ శ్రీఘాకోళ్ళపు శివరామసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏపీ ఆర్యవైశ్య మహాసభ సాధారణ సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మనం కూడా మారాలన్నారు. ప్రస్తుతం పరిస్థితులు మారిన దృష్ట్యా రాజ్యాధికారం సాధించాలన్నారు. ఆర్యవైశ్య మహాసభకు రాజకీయ రంగు పులమలేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ కుమార్ మాట్లాడుతూ ఏపీ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రాయలసీమ, ఆంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాల ఎన్నికలు ప్రక్రియను వివరించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు రత్నాజీ మాట్లాడుతూ పెద్దలు కొణిజేటి రోశయ్య ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ ఒక్కతాటిపై నడిచిందన్నారు. కానీ ఇప్పుడు రెండు వర్గాలుగా విడిపోవడం సరికాదన్నారు. శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు గుప్తా మాట్లాడుతూ ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ఉండాలన్నారు. గుబ్బా చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చిలో జనరల్ ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ద్వారకానాథ్ నెల ముందే మహాసభ ఎన్నికలు జరుపుతున్నారని చెప్పారు. శ్రీఘాకోళ్ళపు శివరామసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్య మహాసభ రాజకీయ లక్ష్యం కోసం పెట్టిందికాదన్నారు. కుసుమంచి సుబ్బరాయులును మహాసభ నూతన అధ్యక్షుడిగా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నుకున్నట్లు చెప్పారు. మహాసభలో విశాఖ అర్బన్ అధ్యక్షుడు అమర్, రూరల్ అధ్యక్షుడు సత్యనారాయణ, కాకినాడ అర్బన్ అధ్యక్షుడు బాదం మధు, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు రంగప్రసాద్, ఏలూరు అర్బన్ అధ్యక్షుడు చక్కా రాజా, బ్రాహ్మయ్య, గుంటూరు అర్బన్ అధ్యక్షుడు ఆత్మకూరి నగేష్, నెల్లూరు అర్బన్ అధ్యక్షురాలు జ్యోతి, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఆండాల్, సీతాలక్ష్మి, నేతలు హరనాథ్, శరత్ పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ కమిషనర్, స్పందన'

కార్పొరేషన్ (కాకినాడ), జనవరి 28: కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్, అనంతరం స్పందన కార్యక్రమాలు నిర్వహిస్తామని కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు తెలిపారు. 0884-2357800కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'జగన్ ప్రభుత్వాన్ని తరిమికొట్టేందుకు జనం సిద్ధం'

కాకినాడ సిటీ, జనవరి 28: అవినీతి, అరాచక, దోపిడీ, విధ్వంసక పాలన సాగిస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించి తరిమికొట్టేందుకు జనం సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు అన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం కాకినాడ సిటీ నియోజకవర్గ పరిధిలోని క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లకు ఓటర్ వెరిఫికేషన్, భవిష్యత్తు గ్యారంటీ, ఫై టీడీపీ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొండబాబు మాట్లాడుతూ జగన్‌రెడ్డి అహంకారానికి, అరాచక పాలనకు స్వస్తి పలికేందుకు రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలు, ఉద్యోగులు, కార్మికులు వేచి చూస్తున్నారన్నారు. వైసీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడాల్సిన కాపాడాల్సిన బాధ్యత నేడు ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జగన్‌రెడ్డి అసమర్ధ పాలన వల్ల రాష్ట్రం అప్పులు నానాటికీ పెరిగి ప్రజలపై భారం పడుతోందన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని జగన్ ఇప్పుడు చెబుతున్నాడని, కానీ ప్రజలు వైసీపీని ఓడించేందుకు ఎప్పటినుంచో సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ అరాచక, విధ్వంసకర పాలనను ప్రతికుటుంబానికి వివరించి టీడీపీ-జనసేనను గెలిపించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం పరిశీలకులు యు.శివశంకర్, ఎస్.సత్యనారాయణ, సాంబశివరావు, నాయకులు తుమ్మల రమేష్, ఎంఏ తాజుద్దీన్, పలివెల రవి, సీకోటి అప్పలకొండ, కశింకోట చంద్రశేఖర్, బగారు సత్యనారాయణ, చోడి పల్లి సతీష్, ఎస్‌కే రహీమ్, పంతాడి రాజు,తుమ్మల సునీత,మీసాల సునీత పాల్గొన్నారు.

'బీజేపీ బలోపేతానికి కృషి'

ప్రత్తిపాడు, జనవరి 28: శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ కమిటీలు బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్టీ రాష్ట్ర విస్తారక్ ఇన్‌చార్జ్ ఉన్ని కృష్ణ కోరారు. ఏలేశ్వరంలో ఆదివారం ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల శక్తికేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశం రెడ్డి లోవరాజు స్వగృహం వద్ద అసెంబ్లీ కన్వీనర్ గంటా బాలు దొర ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథులుగా రామ్‌కుమార్, ఉన్ని కృష్ణ మాట్లాడుతూ ఫిబ్రవరి మొదటివారంలో దేశవ్యాప్తంగా నిర్వహించే పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ కోసం పని చేసి ప్రధానిగా మోదీని మూడోసారి విజయం సాధించేందుకు బీజేపీ కార్యకర్తలు ప్రధాని చేపట్టే ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కాకినాడ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, 3 మండలాల పార్టీ అధ్యక్షులు గట్టిం వెంకటరమణ, కూరాకుల రాజా, కందా వీరాస్వామి, వెలుగూరి హరే రాం, కర్రి ధర్మరాజు, రెడ్డి వరలక్ష్మి, మదినే బాబ్జి, చింతాకుల రామకృష్ణ, గొల్లపల్లి త్రినాథ్ పాల్గొన్నారు.

'భూ హక్కుచట్టంతో ప్రజలకు నష్టం'

ప్రత్తిపాడు, జనవరి 28: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ హక్కుచట్టం ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వకపోగా వారి ఆస్తులను వివాదాల్లోకి తీసుకెళ్తుందని, దీని వల్ల పేద, మధ్యతరగతి ప్రజలు నష్టపోతారని, దీనిని వెంటనే రద్దు చేయాలని ఐలాజ్ రాష్ట్ర కన్వీనర్ బుగతా శివ, కమిటీ సభ్యురాలు అవసరాల దేవి పేర్కొన్నారు. ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామంలో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో భూ హక్కుపై రైతులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రాష్ట్రంలో 563 సివిల్ కోర్టులు పరిష్కరించలేని సివిల్ కేసులు కేవలం 23మంది టైటిలింగ్ ఆఫీసర్‌లు ఎలా పరిష్కరిస్తామని ప్రశ్నించారు. భూ హక్కు చట్టం భూ బకాసురులకు పెట్టుబడి దారులకు వరంగా మారుతుందన్నారు. సమావేశంలో ఎంపీటీసీ పసల సూరిబాబు, కోరుకొండ నూకరాజు, రాజేశ్వరరావు, కూరాకుల నాగరాజు, అయోధ్య, శేషగిరి, వెంకటేశ్వరరావు, శివరామకృష్ణ, కోలా సూరిబాబు, తోట దొరబాబు ఉన్నారు.

టీడీపీ క్లస్టర్ స్థాయి సమావేశాలు

కాజులూరు, జనవరి 28: రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం పిలుపు మేరకు కాజులూరు మండల గ్రామాల్లోని 3 క్లస్టర్లలో టీడీపీ ఇంటిగ్రేట్ ట్రైనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లపాలెం క్లస్టర్ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి రాయుడు లీలాశంకర్, కుయ్యేరు క్లస్టర్ ఇన్‌చార్జి వసుం వీరబ్రహ్మం ఆధ్వర్యంలో యూనిట్ ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. టీడీపీ మండలాధ్యక్షుడు పేపకాయల నారాయణరావు, బొమ్ము బాలకృష్ణ, బీ.రాజేష్, పలివెల ప్రకాష్‌లు హాజరై క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన విధానాలపై టీడీపీ నాయకులకు అవగాహన కల్పించారు. మండల బీసీ సెల్ అధ్యక్షుడు వల్లు అర్జునరావు, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు పలివెల ఇజ్రాయిల్‌రాజు, మహిళా అధ్యక్షురాలు మాసాబత్తుల సత్యవతి, మాజీ ఎంపీటీసీ రాగం పోలరాజు తదితరులున్నారు.

కోటి మట్టి శివలింగాల తయారీ పరిశీలన

జగ్గంపేట, జనవరి 28: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో ఏలేరు నది తీరాన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయం వద్ద కోటి మట్టి శివలింగాలతో జ్యోతుల నెహ్రూ కుటుంబం తలపెట్టిన మహాకుంభాభిషేకానికి మట్టి శివలింగాల తయారీ జరుగుతుంది. అరుణాచలం శ్రీ వత్స పీఠం (తిరువణికమలై పీఠాధిపతి స్వామిజీ శ్రీ వాత్సల్య ధర్మ వీరస్వామి విచ్చేసి లింగాల తయారీని పరిశీలించారు. నెహ్రూతో మాట్లాడుతూ కుంభాభిషేకం జరిగే సమయంలో తాను పాలుపంచుకుంటానన్నారు. నెహ్రూ కుటుంబానికి ఆశీస్సులు అందించారు. జ్యోతుల మణి, తోట సర్వారాయుడు, తోట సునీత, బోదిరెడ్డి సుబ్బారావు, అడబాల సత్తిబాబు, నున్నం రాంబాబు, దిడ్డి రాజు,జ్యోతుల వీరభద్రం, దొడ్డిపట్ల బుజ్జి, పలివెల లోకేష్,కంద సత్యానందం ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

కాకినాడ సిటీ, జనవరి 28: సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాకినాడ జగన్నాథపురం శివారు ప్రాంతాల్లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ప్రజలకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య పరిరక్షణపట్ల అవగాహన కల్పించారు. పాటించాల్సిన ఆహార నియమాలు, వ్యాయామాల వివరించారు. ఫౌండేషన్ సభ్యులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు తలాటం హరీష్, పినిశెట్టి సురేష్, యర్రంశెట్టి చలపతి, కాకర్ల అబ్బాయ్, వాసిరెడ్డి శేషప్రసాద్ పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్యశిబిరం

పిఠాపురం, జనవరి 28: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీమ్ అపర్ణా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో వీరభద్ర హోమియె క్లినిక్ వైద్యులు 300 మందిని పరీక్షించి మందులు అందజేశారు. శిబిరానికి వచ్చినవారికి షుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ ఆకొండి వెంకటేశ్వరశర్మ, డాక్టర్ వైఎస్ కిరణ్, డాక్టర్ సూర్యపవన్‌రామ్, డాక్టర్ నాగమనోజ్ఞ, డాక్టర్ బేతఅఖిల ఉన్నారు.


నేటి నుంచి ప్రజాభిప్రాయసేకరణ

సామర్లకోట, జనవరి 28: విద్యుత్ ప్రసార సంస్థ, విద్యుత్ పంపిణీ సంస్థలు ఆర్థిక సంవత్సరం 2024-25 సంవత్సరానికి ప్రతిపాదిత రిటైల్ సరఫరా ధరలపై విద్యుత్ నియంత్రణమండలితో ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 1 వరకూ సామర్లకోట విద్యుత్ ఏడీఈ కార్యాలయంలో ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించనున్నట్టు విద్యుత్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వ చర్యలపై ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపేందుకు సామర్లకోట ఏడీఈ కార్యాలయంలో నిర్దేశించిన రోజుల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ తిరిగి 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8333818099లో సంప్రదించాలని ఈఈ కోరారు.

31న ఏలూరులో విమలక్క సభ

పెద్దాపురం, జనవరి 28: కొల్లేటి సరస్సుపై అరుణోదయా సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క పాడిన పాటకు ఈనెల 31న ఏలూరులో విడుదలకు సంబంధించి నిర్వహించే సభను విజయవంతం చేయాలని రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. మండలంలోని పులిమేరు గ్రామంలో అందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొండా దుర్గారావు, వి.రాజబాబు, రమేష్, అంజిబాబు, సురేష్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం!



సామర్లకోట, జనవరి 28: సామర్లకోట అయోధ్య రామపురం సత్తెమ్మ ఆలయం రోడ్డులో టార్పాలిన్ కంపెనీ సమీపాన విద్యుత్ స్తంభం పూర్తిగా తుప్పుపట్టి శిథిలావస్థకు చేరి ఏక్షణమైనా కూలిపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్ర్కీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, 105 మినిట్స్, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్ర్కీన్స్: నా సామిరంగ, సైంధవ్, గుంటూరు కారం, హనుమాన్, కెప్టెన్ మిల్లర్

తిరుమల	:	సైంధవ్
లక్ష్మి	:	ఫైటర్
సీ అండ్‌సీ1	:	గుంటూరు కారం
సీ అండ్‌సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	నా సామిరంగ
పద్మప్రియ	:	గుంటూరు కారం
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	హనుమాన్

ఆంజనేయస్వామికి పూజలు

సర్పవరం జంక్షన్, జనవరి 28: సర్పవరం రాజ్యలక్ష్మి ఉద్యానవనంలో పుల్ల చంద్రరావు చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు చందూ ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామికి లక్ష తమలపాకులతో పూజలు నిర్వహించారు. పుల్ల మంగరాజు, కృపావతి దంపతులు విశేష పూజలు చేశారు. 16 మంది పేద బ్రాహ్మణులకు తలో 25 కిలోల బియ్యం బస్తాలు, నెలరోజులకు సరిపడే నిత్యవసర సరుకులు చందూ పంపిణీ చేశారు. ఆలయ చైర్మన్ పుల్ల నారాయణరావు, సర్పంచ్ శీలం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ పుల్ల ప్రభాకరరావు ఉన్నారు.

జగన్‌ని ఓడించేందుకు ప్రజలు సిద్ధం

» టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

» పలుచోట్ల బాబు ష్యూరిటీ కార్యక్రమాలు



పిఠాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న వర్మ



కరపలో కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నేతలు

పిఠాపురం, జనవరి 28: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్‌రెడ్డిని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం జగ్గయ్యచెరువు కాలనీలో ఆదివారం బాబు ష్యూరిటీ -భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. జగన్‌రెడ్డికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ఇక మిగిలి ఉంది 74రోజులు మాత్రమేనని చెప్పారు. వైసీపీ పాలకుల దురాగతాలతో విసిగిపోయిన ప్రజలు వారిని తరిమికొట్టేందుకు సిద్ధమయ్యారని, ఎన్నికల తర్వాత వైసీపీ ఉండదని వర్మ తెలిపారు. జగ్గయ్యచెరువు కాలనీకి ఎంపీ, ఎమ్మెల్యేలు చేసిందేమి లేదని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా రూ.10కోట్లు వ్యయంతో సీసీరోడ్లు నిర్మించానని తెలిపారు. ఎన్నికలు ముందు పలువురు నాయకులు వస్తూ ఉంటారని, వారి లక్ష్యం అధికారం, దోచుకోవడమేనని తెలిపారు. ఓటు వేస్తే నియోజకవర్గంలో ఉంటారని, లేకుండా తమ నియోజకవర్గానికి వెళ్లిపోతారని చెప్పారు. తాను మాత్రం గెలిచినా, ఓడినా ప్రజలతోనే ఉన్నానని వర్మ తెలిపారు. కాగా పలువురు టీడీపీలో చేరగా వారికి వర్మ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి కొరుప్రోలు శ్రీను, వార్డు ఇన్‌చార్జి వాసంశెట్టి సూరిబాబు, కర్రి లోవరాజు, గరగపాటి రమణ, గాయత్రి, దుర్గాప్రసాద్, మౌళి, తనుకులయ్య తదితరులు పాల్గొన్నారు.

కరపలో...

కరప, జనవరి 28: కరపలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా టీడీపీ మండలాధ్యక్షుడు దేవు వెంకన్న ఆధ్వర్యంలో జరిగన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహ కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరలోనే ఎన్నికల శంఖారావం మోగబోతోందని. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి వచ్చే ఎన్నికల్లో జనసేన, టీడీపీల విజయానికి కృషి చేయాలని కోరారు. చంద్రబాబును సీఎం చేసి రాష్ట్రాన్ని కాపాడుకోవాలన్నారు. మేనిఫెస్టోలో పథకాలను ప్రజలకు వివరించారు. బూత్ కన్వీనర్ గొర్రెల వెంకటరమణ, దేవు శ్రీను, కరెడ్ల అబ్బు, మందనక్క జగ్గారావు, జనసేన నాయకుడు ముత్యాలరావు ఉన్నారు.

రేపూరులో....

కాకినాడ రూరల్, జనవరి 28: సీఎం జగన్‌కు ఓటమిభయం పట్టుకుందని అందుకే అతను బేలగా మాట్లాడుతున్నాడని టీడీపీ కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకె శ్రీనివాస్‌బాబా అన్నారు. రూరల్ మండలం రేపూరులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి టీడీపీ పథకాల పత్రాలను అందజేసి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పెంకే శ్రీను, నక్కాశ్రీను, సుబ్బారావు, రమణ, నరేష్‌కుమార్, వెంకటరమణ, చిన్న పాల్గొన్నారు.

వైసీపీకి ఎన్నికల్లో 10 సీట్లు కూడా రావు

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ



టీడీపీలో చేరినవారిని ఆహ్వానిస్తున్న నెహ్రూ

జగ్గంపేట, జనవరి 28: వైసీపీ అస్తవ్యస్థమైన, దిక్కుమాలిన పాలనపై ప్రజల్లో వస్తున్న విపరీతమైన తిరుగుబాటుతో రేపు రాబోయే ఎన్నికల్లో వైనాట్ 175కాదు 10 సీట్లు కూడా రావని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ విమర్శించారు. జగ్గంపేట మండలం ఇర్రిపాక వైసీపీ నేత పంతం వెంకట తిమ్మిరాజు(బాబు) టీడీపీలో చేరారు. ఆయన కుటుంబానికి నెహ్రూ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకత ఊహించి ప్రజలు తరిమికొడతారనే భయంతో తప్పుకుంటానంటూ జగన్ కథలు అల్లుతున్నాడని దుయ్యబట్టారు. ముందే ప్రకటించి తప్పుకోకుంటే ప్రజలు తరిమికొడతారనేభయం జగన్‌లో స్పష్టమైందన్నారు. ఐదేళ్లుగా ప్రజల్ని, ప్రజా వనరుల్ని దోచుకుని దాదాపు రూ.4లక్షల కోట్లు దోచుకున్నారని విమర్శించారు. మరోవైపు ఇప్పటికే దాదాపు రూ.10లక్షలు కోట్లకు పైగా అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్రాన్ని నడపడం ఎలాగో చేతకాదు దాన్ని కవర్ చేసుకోవడానికి దిగిపోతున్నా.. సంతోషంగా దిగిపోతా అంటూ జగన్ చిలక పలుకులు పలుకుతున్నారన్నారు. విద్యావ్యవస్థను నాశనం చేసిందెవరో ప్రజలందరికీ తెలుసు అని నెహ్రూ అన్నారు. పంతం సత్యనారాయణ, జ్యోతుల వీరభద్రరావు, దొడ్డిపట్ల బుజ్జి, జ్యోతుల బాబ్జి, జ్యోతుల సత్తిరాజు పాల్గొన్నారు.

రాబోయేది జనసేన - టీడీపీ ప్రభుత్వం

జనసేన కాకినాడ రూరల్ ఇన్‌చార్జి నానాజీ



పోలవరంలో పర్యటిస్తున్న నానాజీ

సర్పవరం జంక్షన్, జనవరి 28: ప్రజా వ్యతిరేకతో వైసీపీ కొట్టుకుపోవడం ఖాయమని, ప్రజాశీస్సులతో రాబోయేది జనసేన -టీడీపీ ప్రభుత్వమని జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పంతం నానాజీ అన్నారు. ఆదివారం జనం కోసం పవన్, పవన్ కోసం మనం కార్యక్రమంలో భాగంగా తమ్మవరం పంచాయతీ శివారు పోలవరంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పర్యటించిన ఎమ్మెల్యే తర్వాత కనిపించకుండా పోయారని విమర్శించారు. పంచాయతీ ఏకగ్రీవమైతే అభివృద్ధి పనులకు నిధులిస్తామని చెప్పి ఈనాటి వరకు ఏ అభివృద్ధి చేపట్టలేదన్నారు. ప్రజల తాగునీటి సమస్యతో బాధపడుతున్నట్లు చెప్పారని, ట్యాంకు నిర్మిస్తామని చెప్పిన ఎమ్మెల్యే నేటికీ నిర్మాణం చేపట్టలేదని విమర్శించారు. ఇళ్ల పట్టాలు కేవలం వైసీపీ కార్యకర్తలకు ఇచ్చి, జనసేన కార్యకర్తలను సాకుచెప్పి ఇచ్చిన పట్టాలు రద్దు చేసిన దుర్మార్గులన్నారు. వైసీపీ అరాచక పాలనకు ప్రజలు ముగింపు పలకనున్నారని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయగల సత్తా టీడీపీ, జనసేన ప్రభుత్వానికి ఉందన్నారు. కరెడ్ల గోవిందు, సోడె ముసలయ్య, భాస్కరరావు పాల్గొన్నారు.

దళిత నేతలతో మహాసేన రాజేష్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న రాజేష్

తుని రూరల్, జనవరి 28: తుని నియోజకవర్గానికి చెందిన దళిత నాయకులు, టీడీపీ కీలక నాయకులతో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి సారిపల్లి (మహాసేన) రాజేష్ సమావేశమయ్యారు. వైసీపీ పాలనలో దళితులపై జరుగుతున్న దాడులను వివరిస్తూ వచ్చే నెల 3న కాకినాడ అంబేడ్కర్ భవనంలో జరగనున్న జగన్ చేతి దగా పడ్డ దళిత వీర రా కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట కాకినాడ జిల్లా ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొల్లాబత్తుల అప్పారావు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, పోల్నాటి శేషగిరిరావు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, తుని నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ దిబ్బ శ్రీను, టీడీపీ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ తాటిపాక సురేష్, పినపోతుల నూకరాజు, బోడపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలపై 4న ఉచిత అవగాహన

సామర్లకోట, జనవరి 28: ఏపీపీఎస్సీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పోటీ పరీక్షలపై సామర్లకోట చెక్కెర అతిథి గృహం ఆవరణలో ఈనెల 4న ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఉచిత అవగాహనా సదస్సును గుణ్ణం చంద్రమౌళి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గుణ్ణం చంద్రమౌళి సౌజన్యంతో నిర్వహించనున్నట్టు ఫ్యాకల్టీలు తాతపూడి సుశీల్ కుమార్, కాకర ముత్యాలరావు, వైబోగుల గోపాలకృష్ణలు చెప్పారు. సదస్సు అనంతరం స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ సదవకాశాన్ని పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తిగలవారు ఫిబ్రవరి 2 సాయంత్రం 5 గంటల్లోగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని వివరాలకు 9133675999, 7013671046లో సంప్రదించాలని కోరారు.

పంచామృతాభిషేకం

పెద్దాపురం, జనవరి 28: స్థానిక మరిడమ్మ దేవస్థానంలో అమ్మవారి జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని ఆదివారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. వేదపండితులు ఆధ్వర్యంలో అమ్మవారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేదపండితులు, అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

'సైకో పాలనకు స్వస్తి చెప్పాలి'

తుని రూరల్, జనవరి 28: అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలన చేసిన సైకో జగన్ పాలనకు స్వస్తి చెప్పాలని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య అన్నారు. తుని 15వ వార్డుతో పాటుగా మండలంలో రేకవానిపాలెంలో ఆదివారం ఆమె ఇంటింటా ప్రచారం చేపట్టారు. టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. టీడీ పీ నేత పోల్నాటి శేషగిరిరావు, పట్టణాధ్యక్షుడు ఇను గంటి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ మళ్ల గణేష్, అల్లురాజు, జల్లు వాసు, గాది వరహాల బాబు, చింతమనీడి నాగసోమరాజు ఉన్నారు.

'నష్టాన్ని భర్తీ చేయాలి'

తాళ్లరేవు, జనవరి 28: తాళ్లరేవు చెరువుగట్టుసెంటర్ పాన్‌షాపులో జరిగిన అగ్నిప్రమాద నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేసి బాధితుడు మట్టపర్తి తాతారావును ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం అగ్నిప్రమాదం జరిగిన షాపును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుత్తుల శ్రీనివాససాయి, టేకుమూడి లక్ష్మణరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, మందాల గంగసూర్యనారాయణ,కెత్రిమూర్తులు ఉన్నారు.

సీపీఐ నేతల ఆందోళన

పిఠాపురం, జనవరి 28: పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఉన్న ఖాళీ స్థలాలు కబ్జాకు అధికార పార్టీ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ సీపీఐ, ఏఐటీయూసీ నేతలు ఆందోళన నిర్వహించారు. సర్వే నెంబరు 257లో 84సెంట్లు స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆందోళనలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు సాకా రామకృష్ణ, కేశవరపు అప్పలరాజు, ముత్యాల అప్పారావు, పొట్నూరి అమ్మలు, బంగారు కన్నయ్య, చెక్కా అప్పలకొండ, యర్రంశెట్టి పద్మ, జి.సత్యవతి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

కాకినాడ రూరల్, జనవరి 28: విద్యాహక్కు చట్టాన్ని సవరించి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తూ డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టేందుకు వెంటనే ఉత్తర్వులు విడుదల చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకినాడ ఎస్టీయూ విద్యాభవన్‌లో ఆదివారం జరిగిన జిల్లా ఎస్టీయూ కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన భవిష్యనిధి, జీవిత బీమా, సంపాదిత సెలవు, పీఆర్సీ, డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. ప్రభుత్వం 12వ పీఆర్సీని ప్రకటించి నెలలు గడుస్తున్నా చైర్మన్ నేటికీ విధుల్లో చేరకపోవడంతో ఉపాధ్యాయులకు తీవ్రమైన నష్టం జరుగుతున్నదన్నారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పోరాటకార్యక్రమాలు చేపడుతుందని.. ఫిబ్రవరి 17, 18న పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించే సమావేశంలో భవిష్యత్ పోరాట కార్యక్రమాలను నిర్ణయిస్తామన్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కె.కాశీవిశ్వనాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి మోర్త శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి శేశెట్టి సత్యనారాయణ, నాయకులు సుబ్బరాజు, వెంకటేశ్వరరావు, సంపత్‌కుమార్, రామకృష్ణ, త్రినాథ్ ఉన్నారు.

సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ, వీసీ, ఎమ్మెల్యేలు

జేఎన్టీయూకే, జనవరి 28: జేఎన్టీయూకే మైదానంలో ఖేలో ఇండియా పథకలో భాగంగా మంజూరైన 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్(8లేన్లు) నిర్మాణానికి ఆదివారం కాకినాడ ఎంపీ వంగా గీత శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఎంపీ, గౌరవ అతిథులుగా ఎమ్మెల్యేలు కురసాల కన్నబాబు, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ ఈ ట్రాక్ నిర్మాణానికి మొత్తం రూ.13.55కోట్ల నిధులు అవసరం కాగా కేంద్ర ప్రభుత్వం రూ.9.50కోట్లు మంజూరు చేయగా దానికి మ్యాచింగ్ గ్రాంట్‌గా యూనివర్సిటీ నుంచి రూ.4.05 కోట్ల నిధులు విడుదల చేస్తామన్నారు. రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్, డీఈఈ మోహన్‌ప్రసాద్, సీతశ్రీనివాసులు, ఏఈలు సన్నీ, నవీన్, కుడా చైర్‌పర్సన్ చంద్రకళాదీప్తి, గట్టి సత్యనారాయణ, రంగా, డీఎస్‌డీవో శ్రీనివాస్ కుమార్, సుబ్రహ్మణ్యం, రాజేంద్ర, పీడీలు పాల్గొన్నారు.

రాజమండ్రి తరలిన ఉపాధ్యాయులు

తాళ్లరేవు, జనవరి 28: ఓట్ ఫర్ ఓపీఎస్ నినాదంతో రాజమండ్రి ఎస్‌కెవిటి డిగ్రీ కళాశాలలో ఆదివారం జరిగిన సభకు యూటీఎఫ్ మండలాధ్యక్షుడు ఎమ్.తాతారావు, మండలం నుంచి 66మంది ఉపాధ్యాయులు తరలివెళ్లారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో పాతపెన్షన్ విధానం ఏ రాజకీయ పార్టీ అమలుచేస్తుందో వారికే ఉపాధ్యాయులంతా ఓట్లు వేయాలని తీర్మానం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి చెక్కా త్రిమూర్తులు, జిల్లాసహాధ్యక్షురాలు బి.నాగమణి, వి.సోనీ, కట్టా ఈశ్వరరావు, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: రాజమండ్రిలో ఓటు ఫర్ ఓపీఎస్ సభకు రౌతులపూడి నుంచి యుటీఎఫ్ మండలాధ్యక్షుడు కోరుప్రోలు హరిబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులుభారీగా తరలివెళ్లారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కొత్తపల్లి, జనవరి 28: ఉప్పాడ కొత్తపల్లి వీర్రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1972-73, 1973-74, 1974-75 సంవత్సరాల్లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశంలో కలిశారు. సుమారు 52 ఏళ్ల కింద చదువుకున్నవారంతా ఒకేసారి కలిసి తమ పాఠశాలలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థుల 5 కమిటీ సభ్యులను పూర్వ విద్యార్థులతో పాటు గురువులు అభినందించారు.



కొత్తపల్లిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న కోర్పు సాయితేజ్

గండేపల్లి, జనవరి 28: గండేపల్లి కొత్తపేటలో నూతనంగా నిర్మించిన లక్ష్మీగణపతి ఆలయానికి ఆదివారం జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు కోర్పు సాయితేజ్ రూ.లక్ష విరాళాన్ని జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ చేతులమీదుగా ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర తెలుగు ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి బొల్లంరెడ్డి రామకృష్ణ, పార్టీ గండేపల్లి అధ్యక్షుడు వెలమాటి కాశీ, జిల్లా టీడీపీ బీసీ సెల్ నాయకులు చిటికెల కన్నబాబు, వెంపాటి సతీష్, ఆలయ కమిటీ పెద్దలు చలుమూరి అప్పారావు, నాళం శ్రీను, వేకా నాగరాజు, వేకా పరదేశ నాయుడు, తెట్లపు శివయ్య, సలుమూరు బాలు, నాళం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా పద్మావతి బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం, జనవరి 28: పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా కేవీ.పద్మావతి ఆదివారం బాధ్యతలను స్వీకరించారు. ఆమె నిడదవోలు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై పెద్దాపురం మున్సిపాల్టీకి వచ్చారు. ప్రస్తుతం పెద్దాపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జంపా సురేంద్ర గ్రేటర్ విశాఖపట్టణం మున్సిపల్ కార్పొరేషన్ సూపరిన్‌టెండెంట్‌గా బదిలీ అయ్యారు. పద్మావతికి మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

బైక్‌ను తగులబెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

పొన్నాడ (కొత్తపల్లి), జనవరి 28: ఇంటి బయట పార్క్ చేసిన హీరో హోండా మోటార్‌సైకిల్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామును తగులబెట్టారు. పొన్నాడ శివారు రావివారిపోడుకు చెందిన బోణం చంటికి చెందిన బైక్ ఇంటి బయట పార్క్ చేస్తుంటారు. గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి నిప్పుపెట్టి ఉంటారన్న చంటి చెబుతున్నారు.ఈ విషయమై కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కొత్తపల్లి, జనవరి 28: రోజువారీ పనుల్లోకి బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తిని ఆటో వెనుక నుంచి ఢీకొంది. పొన్నాడకు చెందిన లంకే రావు అమీనబాద్ హార్బర్ ప్రాంతంలో వెనుక నుంచి ఆటో ఢీ కొనడంతో తలకు తీవ్ర గాయాలై రక్త స్రావం కావడంతో అమీనబాద్ సర్పంచ్ నక్కా మణికంఠ అత్యవసర చికిత్సకు కొత్తపల్లి ప్రవేటు ఆసుపత్రికి తరలించారు.

మద్యం పట్టివేత

రౌతులపూడి, జనవరి 28: లచ్చిరెడ్డిపాలెం గ్రామంలో అక్రమంగా అమ్ముతున్న మద్యాన్ని రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ పట్టుకున్నారు. అప్పారావు వద్ద 7 బాటిళ్లు, బద్రారావు వద్ద 30, వెంకటరమణ వద్ద 17 బాటిళ్లు మద్యం స్వాధీనం చేసుకుని ఎస్ఐ కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రావులమ్మ తల్లి సంబరం

జగ్గంపేట, జనవరి 28: జగ్గంపేటలో ఆదివారం గద్దపేట చెందిన వారు రావులమ్మ తల్లి తల్లి సంబరాన్ని ఘనంగా నిర్వహించారు. బ్యాండ్ మేళాలు, బాణసంచా, పలు దేవత మూర్తుల వేషధారణతో ఆకట్టుకున్నారు. గ్రామంలో అన్ని వీధుల్లోని గరగలు,డబ్బులతో సంబరాన్ని వైభవంగా జరిపారు.

వృద్ధులకు చీరలు, అన్నదానం

ప్రత్తిపాడు, జనవరి 28: ప్రత్తిపాడు జాతీయ రహదారిపై గల పాదాలమ్మ ఆలయం వద్ద గల శారదా వృద్ధ శరణాలయంలోని వృద్ధులకు న్యాయవాది, యునైటెడ్ మానవహక్కుల సంరక్షణ కౌన్సిల్ జాతీయ లీగల్ కార్యదర్శి పిల్లి బలరాముడు అన్నదానం నిర్వహించి చీరలు, దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాకాడు నూకరాజు, దూలపల్లి వెంకటరమణ, చిన్నబాబు, అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రామానంద స్వామికి సన్మానం

ప్రత్తిపాడు, జనవరి 28: రాచపల్లి రమణ సేవాశ్రమ స్థాపకుడు రామానంద స్వామిని ఆదివారం ఏలేశ్వరానికి చెందిన సత్తి గిరిధర్ రెడ్డి,సతీమణి సితార ఘనంగా సన్మానించారు. రాచపల్లి నుంచి ఏలేశ్వరం గిరిధర్ రెడ్డి ఇంటికి విచ్చేసిన స్వామిని పూర్ణకుంభంతో స్వాగతం పలికి సత్కరించారు. రామానంద స్వామి అపీత కుంచాబసమేత అరుణాచలేశ్వర స్వామి విశిష్టత, రమణ మహర్షుల బోధనలు వివరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల అందజేత

పెద్దాపురం, జనవరి 28: సంక్రాంతిని పురస్కరించుకుని స్థానిక పట్టాభి అగ్రోఫుడ్స్ సంస్థ నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను ప్రముఖ పారిశ్రామికవేత్త సూరే వేణు చేతులమీదుగా ఆదివారం అందజేశారు.కార్యక్రమంలో పట్టాభి అగ్రోఫుడ్స్ హెచ్‌ఆర్ గాంధీ, రజని, పద్మశ్రీ, సుబ్రహ్మణ్యం, సుభాష్ లావణ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాప్రసాద్‌కు సేవారత్న పురస్కారం

తుని రూరల్, జనవరి 28: తుని పరిసర ప్రాంతాల్లో ఎంతోమందికి రక్తం దానం చేసిన దుర్గాప్రసాద్‌ను విశాఖపట్నానికి చెందిన తాసుపల్లి ఫౌండేషన్ సత్కరించింది. తుని మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన ఎమర్జెనీ బ్లడ్ సర్వీస్ నిర్వాహకుడు పెంకే దుర్గాప్రసాద్ సేవలకు గాను భారత సేవారత్న పురస్కారం అందజేసింది. ఈ సందర్భంగా పలువురు వైద్యులు దుర్గాప్రసాద్ సేవలు కొనియాడారు.